## ప్రశాంతంగా గ్రూప్-1 మెయిన్స్ పరీక్షలు

**ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్**

యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యుపిఎస్‌సి) గ్రూప్- 1 మెయిన్స్ పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. శనివారం జెఎన్‌టియు ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహించిన గ్రూప్-1 పరీక్షా కేంద్రాలను కలెక్టర్ ఎమ్.గౌతమి అధికారులతో కలిసి పరిశీలించారు. మొత్తం 522 మంది అభ్యర్థులు పరీక్షలు రాయాల్సి ఉండగా 402 మంది హాజరయ్యారు. 120 మంది గైర్హాజరయ్యారు. మొత్తం 77 శాతం మంది హాజరయ్యారు. పరీక్షలు సజావుగా ముగియడంతో సంతోషం వ్యక్తం చేశారు.

జెన్‌టియులో పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ ఎమ్.గౌతమి

జగన్న హౌసింగ్ లేఅవుట్‌లో ఇళ్ల నిర్మాణాలను పరిశీలిస్తున్న కలెక్టర్ అరుణ్‌బాబు

## ఇళ్ల నిర్మాణాలపై నిర్లక్ష్యం చేయొద్దు

### కలెక్టర్ పి.అరుణ్ బాబు

**ప్రజాశక్తి-సోమందేపల్లి**

నవరత్నాలు - పేదలందరికీ ఇళ్లు కింద జగనన్న హౌసింగ్ లేఅవుట్లలో ఇళ్ల నిర్మాణాల పనులపై నిర్లక్ష్యం చేయకుండా, కేటాయించిన లక్ష్యాన్ని సకాలంలో పూర్తి చేయాలని కలెక్టర్ పి.అరుణ్‌బాబు సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం నాడు సోమందేపల్లి మండలంలోని చాకర్లపల్లి, నక్కలగుట్ట జగనన్న హౌసింగ్ లేఅవుట్‌లను పెనుకొండ సబ్ కలెక్టర్‌తో కలిసి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నవరత్నాలు - పేదలందరికీ ఇళ్లు కింద జగనన్న హౌసింగ్ లేఅవుట్లలో ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలన్నారు. సోమందేపల్లి మండలంలోని చాకర్లపల్లి, నక్కలగుట్ట జగనన్న హౌసింగ్ లేఅవుట్‌లో వివిధ దశల్లో ఉన్న నిర్మాణ పనులను పూర్తి చేయించేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఆర్ఎల్, ఆర్సీ స్థాయిలోని ఇళ్ల నిర్మాణాలు కచ్చితంగా లక్ష్యం మేరకు పూర్తి చేయాలన్నారు. లేఅట్‌లలో తాగునీరు, విద్యుత్ సరఫరా లాంటి మౌలిక సదుపాయాలు కల్పించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ పీడీ చంద్రమౌళి రెడ్డి, పిఆర్ ఈఈ మురళీ, హౌసింగ్ డిఈ శివకుమార్ నాయక్, ఏఈ నారాయణరెడ్డి, తహశీల్దార్ సౌజన్య లక్ష్మీ, ఈఓపీఆర్డీ నాగరాజు, ఆర్‌డబ్ల్యూఎస్ డిఈ శ్రీనివాసులు, విద్యుత్ అధికారులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.

## వాలంటీర్ల తొలిగింపుపై సబ్ కలెక్టర్ విచారణ

సచివాలయంలో ఆరా తీస్తున్న సబ్ కలెక్టర్ కార్తీక్

**చిలమత్తూరు :** పలగలపల్లి సచివాలయం పరిధిలోని నలుగురు వాలంటీర్లను తొలగిస్తూ గత నెల ఎండిఓ రామ్ కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. దీనిని సవాల్ చేస్తూ వాలంటీర్లు "జగనన్నకు చెప్పుకుందాం"లో ఫిర్యాదు చేశారు. దీంతో పెనుకొండ సబ్ కలెక్టర్ కార్తీక్ శనివారం పలగలపల్లి సచివాలయ సిబ్బంది, కార్యదర్శి రామ్లానాయక్, సర్పంచి శంకర్ రెడ్డితో పాటు గ్రామస్తులను విచారించారు. అలాగే ఇకపై క్రమశిక్షణ లోపించకుండా నిబంధనల మేరకు పని చేయాలని వాలంటీర్లలకు సూచించారు. అయితే వాలంటీర్లను కొనసాగిస్తారా లేదా అన్నది పూర్తిస్థాయిలో రిపోర్ట్‌ను పరిశీలించిన తర్వాత ప్రకటిస్తామని సబ్ కలెక్టర్ తెలిపారు. ఆయనతో పాటు తహశీల్దార్ నాగరాజు, తదితరులు ఉన్నారు.

# ఇక్బాల్‌ను తప్పిస్తున్నారా..?

◆ తెరపైకి కొత్త పేరు ◆ ఇక్బాల్ కోసం వైసిపి మైనార్టీల పట్టు ◆ ఆయనకే ఎమ్మెల్యే టికెట్టు ఇవ్వాలని డిమాండ్

**ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి**

హిందూపురం వైసిపి ఇన్‌ఛార్జిగా ఉన్న ఎమ్మెల్సీ మహమ్మద్ ఇక్బాల్‌ను ఆ బాధ్యతల నుంచి తప్పిస్తారా.? అన్నది ప్రస్తుతం రాజకీయవర్గాల్లో జోరుగా చర్చ సాగుతోంది. నియోజకవర్గం పరిధిలోని మైనార్టీ నేతలు ఇక్బాల్ పేరును ఖరారు చేయాలని డిమాండ్ చేస్తూ మీడియా సమావేశాలు, ప్రదర్శనలకు దిగేందుకు సైతం సిద్దపడటం దీనికి బలాన్ని చేకూరుస్తోంది. 2019 సార్వత్రిక ఎన్నికలు సమీపించిన సమయంలో ఐపిఎస్ అధికారిగా ఉద్యోగ విరమణ చేసిన మహమ్మద్ ఇక్బాల్‌ను అభ్యర్థిగా ప్రకటించారు. టిడిపి కంచుకోట అయిన హిందూపురంలో అది కూడా నందమూరి బాలకృష్ణపైన పోటీకి దింపడం అప్పుడు చర్చనీయాంశం అయ్యింది. కర్నూలు వాస్తవ్యులైన ఇక్బాల్‌ను అనూహ్యంగా ఇక్కడికి ఎందుకు దింపారన్నది కూడా రాజకీయవర్గాల్లో చర్చ జోరుగా సాగింది. రాష్ట్రమంతా వైసిపి 2019 ఎన్నికల్లో క్లీన్‌స్వీప్ చేసినా టిడిపి మాత్రం హిందూపురం స్థానాన్ని నిలబెట్టుకుని కంచుకోట అన్న పదాన్ని పదిలం చేసుకుంది. ఎన్నికలు అయిన వెంటనే ఇక్బాల్‌ను ఎమ్మెల్సీగా వైసిపి అధిష్టానం ప్రకటించింది. వచ్చే ఎన్నికలకు అంటే 2024 ఎన్నికల్లోపు ఆయన అక్కడి ఉండి రాజకీయంగా వైసిపిని బలోపేతం చేసే బాధ్యతను అప్పగించింది. అప్పటి నుంచి ఆయన హిందూపురం నియోజకవర్గంలోనే ఉంటూ పార్టీ కోసం కృషి చేస్తూ వస్తున్నారు. అయితే అక్కడున్న కొందరు స్థానిక నేతల మధ్య ఇక్బాల్‌కు సరైన సఖ్యత కుదరలేదు. దీంతో పలుమార్లు ఆ నేతల మధ్య మాటల యుద్ధాలు సాగాయి. ఈ నేపథ్యంలో నియోజకవర్గం పరిధిలో వైసిపి ముఖ్యనేత రామకృష్ణరెడ్డి హత్యకు గురయ్యారు. దీనికి ఇక్బాలే కారణమన్న ఆరోపణలు వెల్లువెత్తాయి. అయితే ఆయన తనకు ఎటువంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో విభేదాలు తారా స్థాయికి చేరాయి. ఈ తరుణంలో ఇటీవలే రాష్ట్ర రాజధానికి అధిష్టానం ఇక్బాల్‌ను పిలిపించి మాట్లాడినట్లు రాజకీయవర్గాల్లో చర్చ సాగుతోంది. ఈ సమావేశం అనంతరం ఆయన్ను నియోజకవర్గం బాధ్యతల నుంచి తప్పిస్తున్నారన్న సంకేతాలను ఇచ్చినట్లు తెలుస్తోంది. ఈ క్రమంలోనే ఆయన హైదరాబాద్‌లో కొంతమంది ఇతర పార్టీలకు చెందిన మైనార్టీ నేతలతోనూ మంతనాలు జరిపినట్లు ప్రచారం సాగుతోంది. నియోజకవర్గంలో మైనార్టీల సంఖ్య గణనీయంగానే ఉంది. మైనార్టీలు ఆయనకు మద్దతునిస్తున్నారు. ఇందులో భాగంగానే ఆయన పేరును ఖరారు చేయాలని మీడియా సమావేశాలు పెట్టడమే కాకుండా ఇతర రూపాల్లోనూ ఆయన తన బలాన్ని ప్రదర్శించేందుకు సిద్ధపడినట్లు తెలుస్తోంది. బల ప్రదర్శనకు సైతం దిగుతున్నట్లు ప్రచారం సాగుతోంది.

**తెరపైకి కొత్త నేతలు**

ఇక్బాల్ పరిస్థితి ఇలా ఉంటేయ హిందూపురం వైసిపిలో కొత్త నాయకులను బరిలో దింపేందుకు సమయత్తమైనట్లు ప్రచారం సాగుతోంది. దీప్తిరెడ్డి అనే మహిళా నాయకురాలికి ఇన్‌ఛార్జి బాధ్యతలను అప్పగించే యోచనలో నున్నట్లు వైసిపి వర్గాల్లో చర్చ సాగుతోంది. కొత్త వారిని దింపడం ద్వారా పార్టీలో ఇప్పుడు నెలకొన్న పరిస్థితులను కొంత వరకు చక్కబెట్టే ఆలోచనలో అధిష్టానమున్నట్లు తెలుస్తోంది. ఇక్బాల్‌ను వ్యతిరేకిస్తున్న వారిలో ఒక బలమైన సామాజిక తరగతికి చెందిన వారున్నారు. వారు ఈయన కాకుండా మరొకరును నియమిస్తే కలిసకట్టుగా పనిచేసేందుకు సిద్ధమన్నట్లు అధిష్టానానికి చెప్పిన నేపథ్యంలో ఆయన బలమైన సామాజిక తరగతికి, బిసి తరగతి రెండు కలిసొచ్చే విధంగా దీప్తిరెడ్డిని తీసుకొచ్చేందుకు అధిష్టానం ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇక్బాల్ మాత్రం ఈసారి ఎలాగైనా బరిలో నిలవాలని భావిస్తున్నారు. ఆ మేరకు ఆయన ప్రయత్నాలు చేస్తున్నారు. నేతల మద్దతు కూడగట్టే ప్రయత్నమూ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో అధిష్టానం ఎటువంటి వైపు మొగ్గుచూపుతుందో వేచి చూడాల్సి ఉంది.

## ఇక్బాల్‌కే ఎమ్మెల్యే టికెట్టు ఇవ్వాలి

**ప్రజాశక్తి-హిందూపురం**

హిందూపురం అసెంబ్లీ టికెట్‌ను ఎమ్మెల్సీ, నియోజక వర్గ ఇన్‌చార్జి షేక్ మహమ్మద్ ఇక్బాల్‌కు కేటాయించాలని ఆటో డ్రైవర్లు డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం దాదాపు 300 మంది ఆటో డ్రైవర్లు ఆయనకు మద్దతుగా పట్టణంలో ఆటోలతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా 'ఇక్బాల్ నాయకత్వం వర్ధిల్లాలి.. జయహో ఇక్బాల్' అంటూ నినాదాలు చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ నియోజకవర్గంలో ముస్లిం మైనార్టీలు ఎక్కువగా ఉన్నారు. దీనికి తోడు అన్ని వర్గాల వారిని కలుపుకుని ముందుకుపోతున్న ఇక్బాల్‌కు టికెట్ ఇవ్వాలని కోరారు. వేరొకరికి ఇస్తే ముస్లిం మైనార్టీలు పని చేయరని హెచ్చరించారు.

**చిలమత్తూరు :** హిందూపురం ఎమ్మెల్యే అభ్యర్థిగా ఎమ్మెల్సీ ఇక్బాల్‌ను ప్రకటించాలని మండలంలోని వైసిపి ప్రజా ప్రతినిధులు, నాయకులు కోరారు. ఈ మేరకు శనివారం వారు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ 4 ఏళ్లుగా అందుబాటులో ఉండి సేవలు చేస్తూ నియోజకవర్గంలో అన్ని వర్గాల ప్రజల మన్ననలు పొందిన ఇక్బాల్‌ను ఎమ్మెల్యే అభ్యర్థిగా కేటాయిస్తే టిడిపి కంచుకోటగా పేరొందిన హిందూపురంలో వైసిపి జెండా ఎగరవేస్తామన్నారు. హైకమాండ్ సరికొత్త ప్రయోగాలు చేస్తే పార్టీకి నష్టం తప్పదన్నారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ ప్రభాకర్ రెడ్డి, జడ్పీటీసీ అనూషా, చిలమత్తూరు సర్పంచి సంధ్య, ఎంపిటిసి జగన్ మోహన్ రెడ్డి, వైస్ ఎంపిపి బయప్ప, పలువురు సర్పంచిలు, ఎంపిటిసిలు వార్డు మెంబర్లు, తదితరులు పాల్గొన్నారు.

హిందూపురంలో ఇక్బాల్‌కు మద్దతు జరుగుతున్న ఆటో ర్యాలీ

## 5 నుంచి ఆర్‌బికెల్లో రైతు అవగాహన సదస్సులు

◆ చిరుధాన్యాల సాగు విస్తీర్ణాన్ని మరింత పెంచాలి ◆ జాయింట్ కలెక్టర్ టిఎస్.చేతన్

**ప్రజాశక్తి-రొళ్ల, అమరాపురం**

ఈనెల 5వ తేదీ నుంచి జిల్లాలోని అన్ని రైతు భరోసా కేంద్రాల పరిధిలో రైతులకు అవగాహన సదస్సులు నిర్వహించాలని జాయింట్ కలెక్టర్ టీఎస్.చేతన్ వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు. శనివారం రొళ్ల, అమరాపురం మండలాల్లో కె.శివరాం, మోరుబాగల్, బొమ్మగుండహళ్లి, పి. బ్యాడిగిర గ్రామాల్లో పర్యటించారు. రైతులతో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ రాగి విస్తీర్ణాన్ని మరింతగా పెంచాలని రైతులకు సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం రాయలసీమ జిల్లాలలో పైలెట్ ప్రాజెక్టుగా ప్రతి నెలా లబ్ధిదారులకు ఇచ్చే బియ్యంకు బదులుగా మూడు కేజీల వరకు రాగులును జూన్ నెల నుండి పౌరసరఫరాల సంస్థ ద్వారా పంపిణీ చేయాలని నిర్ణయించిందన్నారు. ఈ పంపిణీకి అవసరం అయ్యే రాగులను ఆయా జిల్లాల పరిధిలో రైతుల నుంచి కనీస మద్దతు ధర క్వింటాలుకు రూ.3578/తో సేకరించి దానిని ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా లబ్ధిదారులకు ఇవ్వాలని నిర్ణయించిందని చెప్పారు. ఈ కార్యక్రమం అమలుకు శ్రీసత్యసాయి జిల్లాకుగాను ఆరు నెలలకు సుమారుగా లక్ష క్వింటాళ్ల రాగులు అవసరం అవుతాయని తెలిపారు. ప్రస్తుతం జిల్లాలో సాగు అయ్యే రాగి పంట ద్వారా సుమారుగా 30 వేల క్వింటాళ్లు పండిస్తుండగా, అందులో రైతుల అవసరాలకు గాను 20 వేల క్వింటాళ్లు పోను పదివేల క్వింటాళ్లు ప్రభుత్వం ద్వారా కొనుగోలుకు అందుబాటులోకి రావచ్చు అని అంచనా ఉందన్నారు. మిగిలిన 90 వేల క్వింటాళ్లు రైతుల నుంచి సేకరించాలంటే ఇప్పుడు సాగు అవుతున్న 2,100 హెక్టార్లకు అదనంగా 7 వేల హెక్టార్లలో రాగి పంట సాగును ప్రోత్సహించాల్సి ఉందన్నారు. రాగి సాగు చేపట్టే రైతులకు వ్యవసాయ శాఖ ద్వారా 50 శాతం రాయితీపై అధిక దిగుబడినిచ్చే రకాలు మరియు నూతన రాగి వంగడాలైన ఇంద్రావతి, వేగావతి, వి.ఎల్. 376 మరియు వి.ఎల్. 352 నాలుగు కిలోల ఉచిత మినీ కిట్లను సరఫరా చేస్తున్నామని చెప్పారు. రైతులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని రాగి విస్తీర్ణాన్ని మరింతగా పెంచాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ మరియు పౌరసరఫరాల శాఖ అధికారులు పాల్గొన్నారు.

అవగాహన సదస్సులో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ టిఎస్ చేతన్

## వ్యాయామం, సైక్లింగ్‌తో రోగాలు దూరం

### డిఎంహెచ్ఓ ఎస్‌వి కృష్ణారెడ్డి

**ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్**

ప్రతిరోజూ వ్యాయామం, సైకిల్ తొక్కడం వల్ల మనిషి ఆరోగ్యంగా జీవించగలరని డిఎంఅండ్‌హెచ్ఓ ఎస్‌వి కృష్ణారెడ్డి పేర్కొన్నారు. "అందరికీ-ఆరోగ్యం" కార్యక్రమంలో భాగంగా శనివారం ఆరోగ్య సిబ్బంది పుట్టపర్తి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుంచి స్థానిక గణేష్ సర్కి ల్ వరకూ సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డిఎంహెచ్ఓ మాట్లాడుతూ రోజూ 30 నిమిషాలు సైకిల్ తొక్కడం ద్వారా ఎలాంటి రోగం దరిచేరదన్నారు. కొవ్వు కరుగుతుందని, రోగ నిరోధక శక్తి పెరిగి రక్తపోటు, గుండె జబ్బులు రాకుండా దోహదం చేస్తుందని తెలిపారు. రక్తపోటు, డయాబెటిక్ లాంటి దీర్ఘకాలిక జబ్బులు ఉన్నా నిదానంగా నయమవుతాయన్నారు. వయసుతో నిమిత్తం లేకుండా ప్రతి ఒక్కరూ సైక్లింగ్ అలవాటు చేసుకుంటే పర్యావరణానికి మేలు చేకూరుతుందన్నారు. డాక్టర్ నివేదిత మాట్లాడుతూ "60 రోజులు టొబాకో స్పెషల్ డ్రైవ్" చేపట్టామని అన్ని పీహెచ్‌సిఎస్/యుపిహెచ్‌సిలలో టొబాకో కార్యక్రమం నిర్వహించాల న్నారు. పిఎంపిఓ డాక్టర్ కెసి కుళ్లాయప్పనాయక్ మాట్లాడుతూ ఆరోగ్య సమస్యలు వచ్చిన తర్వాత చికిత్స తీసుకోవడం కంటే వ్యాయామం, సైకిల్ తొక్కడం ద్వారా ఆ జబ్బులు రాకుండా జాగ్రత్త పడవచ్చు అన్నారు. డాక్టర్ నాగరాజునాయక్ మాట్లాడుతూ ప్రస్తుతం పొగాకు, సిగరె ట్, గుట్కా వినియోగం వల్ల మరణాలు ఎక్కువగా సంభవిస్తున్నాయని, కావున పొగాకు ఉత్పత్తులకు దూరంగా ఉండాలన్నారు. ర్యాలీలో డాక్టర్ జ్యోష్న, డాక్టర్ ఫణీంద్ర, ఏపీ డమాలజిస్ట్ బాలాజీ నాయక్, డీసీఎం త్రిలోకనాథ్, సూపర్‌వైజర్ రమణ, హెల్త్ అసిస్టెంట్ కె.శివయ్య, ఎంపిహెచ్ఎస్ఎస్ సిహెచ్ఓలు, జూనియర్ ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

సైకిల్ ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

## కార్యకర్తల సంక్షేమానికి పెద్దపీట

### ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి

**ప్రజాశక్తి-బుక్కపట్నం**

కార్యకర్తల సంక్షేమానికి వైసిపి అన్ని విధాలుగా చేయూతనందిస్తుందని పుట్టపర్తి శాసనసభ్యులు దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి తెలిపారు. శనివారం మండల కేంద్రంలో ఆయన పర్యటించారు. ఇటీవల మతి చెందిన వాలంటీర్ ప్రభాకర్ కుటుంబాన్ని పరామర్శించారు. ప్రభుత్వం తరుపున అండగా ఉంటామని ఆ కుటుంబానికి భరోసా ఇచ్చారు. అనారోగ్యంతో బాధపడుతున్న మండల కేంద్రానికి చెందిన సింగల్ విండో ప్రెసిడెంట్ రామలింగారెడ్డి పరామర్శించి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. సీనియర్ వైసిపి నాయకులు ఆదినారాయణ రెడ్డి ఇంటికి వెళ్లి నూతన దంపతులను ఆశీర్వదించారు. లక్ష్మీనారాయణ స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ శ్రీధర్ రెడ్డి, వైస్ ఎంపీపీ పార్వతీ, సర్పంచి లక్ష్మీ రాజు, అగ్రి అడ్వైయిజర్ ఛైర్మన్ రమణారెడ్డి, నాయకులు పతాంజలి, నారాయణస్వామి, నాగభూషణ, ఈశ్వర్, మల్లికార్జున పాల్గొన్నారు.

వాలంటీర్ కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి

## మహిళా సాధికారతకు టిడిపి కృషి

**ప్రజాశక్తి-రొద్దం**

మహిళల సాధికారాతకు టిడిపి ఎనలేని కషి చేసిందని తెలుగు మహిళలు తురకలాపట్నం గ్రామంలో హర్షం వ్యక్తం చేశారు. టిడిపి అధినేత మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చిత్ర పటానికి శనివారం పాలాభిషేకం చేశారు. ఇటీవల టిడిపి ప్రకటించిన మేనిఫెస్టోలో మహిళలకు ఉచిత ఆర్టీసీ బస్సు ప్రయాణం, ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితం, 18 ఏళ్ళు దాటిన ప్రతి మహిళకు నెలకు రూ.1500 ఆర్థిక సహాయం, స్కూల్‌కి వెళ్ళే విద్యార్థుల తల్లికి రూ.15వేల సాయాన్ని చంద్రబాబు ప్రకటించారన్నారు. ఈ పథకాలు ప్రజలకు ఎంతో మేలుచేస్తాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ శ్రీనివాసులు, మాజీ డీలర్ శ్రీనివాసులు, నాగభూషణ, హరికష్ణ, షణ్ముఖ, లక్ష్మీపతి గ్రామస్తులు పాల్గొన్నారు.

చంద్రబాబుచిత్రపటం వద్ద హర్షం వ్యక్తం చేస్తున్న తెలుగు మహిళలు

## పోలీసులు నిష్పక్షపాతంగా వ్యవహరించాలి

### మాజీ మంత్రి పల్లె రఘునాథ రెడ్డి

**ప్రజాశక్తి-పుట్టపర్తి క్రైమ్**

పోలీసులు నిష్పక్షపాతంగా న్యాయబద్ధంగా పనిచేయాలని మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి పేర్కొన్నారు. శనివారం పట్టణ డీఎస్పీ వాసుదేవన్‌ను కలిశారు. తనతో పాటు 8 మంది టీడీపీ నాయకుల పైన పెట్టిన ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుపై చర్చించారు. రెండు నెలల క్రితం పట్టణంలోని సత్తెమ్మ గుడి సర్కిల్‌లో వైసీపీ నాయకులు తమపై దౌర్జన్యం చేయడమే కాకుండా, మా పైనే తప్పుడు కేసులు పెట్టారన్నారు. ఆరోజు ఘటనలో ఇద్దరు టిడిపి కార్యకర్తలు గాయపడ్డారని చెప్పారు. దాడి చేసిన వైసిపి వారిపై కేసులు పెట్టకుండా టిడిపి వారిపై కేసులు పెట్టడం న్యాయం కాదన్నారు. అధికార ఒత్తిళ్లకు తలొగ్గి న్యాయన్యాయాలు విచారించకుండా కేసులు పెట్టడం అన్యాయం అన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి పట్టణ కార్యదర్శి రామాంజనేయులు, రాష్ట్ర మైనార్టీ విభాగం కార్యదర్శి మహమ్మద్ రఫీ, జిల్లా కార్యదర్శి సామకోటి ఆదినారాయణ, నాయకులు శ్రీరామ్ రెడ్డి, ఉమాపతి యాదవ్, గుట్లపల్లి గంగాద్రి, మనోహర్ పాల్గొన్నారు.

డీఎస్పీతో మాట్లాడుతున్న పల్లె రఘునాథరెడ్డి

## నేడు విద్యార్థులకు పురస్కారాలు

**బుక్కపట్నం :** పదవ తరగతిలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన గౌడ కుల విద్యార్థులకు ఆదివారం పుట్టపర్తిలోని సాయి ఆరామం నందు గౌడ ఉద్యోగ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో పురస్కారాలు అందజేయనున్నట్లు ఈడిగ గౌడ సంఘం నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ సత్యసాయి జిల్లా పరిధిలోని పదవ తరగతి, ఇంటర్మీడియట్ నందు ఉత్తమ ప్రతిభ కనబరిచిన వంద మంది విద్యార్థులకు ఉత్తమ పురస్కారంతోపాటు నగదును ప్రధానం చేయనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఈడిగ, గౌడ ఉద్యోగుల సంక్షేమ సంఘం నాయకులు తలమర్ల ప్రభాకర్ గౌడ్, రాజేంద్ర గౌడ్, నాగేంద్ర గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## నాణ్యతలేని విత్తన వేరుశనగను మార్చుకోవచ్చు

### జిల్లా వ్యవసాయ సలహా మండలి ఛైర్మన్ రమణారెడ్డి

**ప్రజాశక్తి-పెనుకొండ**

ప్రభుత్వం రాయితీపై పంపిణీ చేస్తున్న విత్తన వేరుశనగ నాణ్యత సరిగా లేదని భావిస్తే రైతులు స్థానిక రైతు భరోసా కేంద్రంలో మార్చుకోవచ్చని జిల్లా వ్యవసాయ సలహా మండలి ఛైర్మన్ అవుటాల రమణారెడ్డి తెలిపారు. మండల పరిధిలోని దుద్దేబండ రైతు భరోసా కేంద్రాన్ని శనివారం ఆయన మండల వ్యవసాయ సలహా మండలి ఛైర్మన్ కొండల రాయుడుతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా వారు విత్తన వేరుశనగ నాణ్యతను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన రైతులతో ముఖాముఖి మాట్లాడుతూ ప్రభుత్వం పెట్టుబడి సాయంగా అందజేస్తున్న పిఎం కిసాన్, వైఎస్ఆర్ రైతు భరోసా పథకం కింద మొదటి విడత నగదును రైతుల ఖాతాలో జమ చేసిందన్నారు. అలాగే రాయితీపై డ్రిప్, స్ప్రింక్లర్లు పంపిణీ చేస్తుందని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. దుద్దేబండ రైతు భరోసా కేంద్రం సిబ్బంది జయరాం రైతులకు సకాలంలో రసాయనిక ఎరువు లు అందుబాటులో ఉంచి పంపిణీ చేయడంపై సంతృప్తి వ్యక్తం చేశారు. కొండల రాయుడు మాట్లాడుతూ ఏప్రిల్‌లో అధిక వర్షాల వల్ల పంట దెబ్బతిన్న రైతులకు సీఎం జగన్ పరిహారం విడుదల చేశారని తెలిపారు. రైతులకు సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో ఏఈఓ ఎం.అశోక్‌కుమార్, రైతు భరోసా కేంద్రం సిబ్బంది జయరాం, ఆదినారాయణరెడ్డి, రైతులు పాల్గొన్నారు.

విత్తన వేరుశనగ నాణ్యతను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయ సలహా మండలి ఛైర్మన్ రమణారెడ్డి

కెజిబివి బోర్డులో జిల్లా పేరు మార్చిన అధికారులు

ప్రజాశక్తి వార్తకు స్పందన

## కెజిబివి బోర్డులో జిల్లా పేరు మార్పు

**రొళ్ల :** రొళ్ల కెజిబివి బోర్డులో మారని జిల్లా పేరు శీర్షికన శనివారం ప్రజాశక్తి దినపత్రికలో వార్త ప్రచురితమైంది. దీనిపై స్పందించిన అధికారులు కెజిబివి బోర్డులో శ్రీ సత్యసాయి జిల్లా అని పేరు మార్చారు. దీంతో కెజిబివిలోని విద్యార్థుల తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు.

ప్రజాశక్తి వార్తకు స్పందన

## రేషన్‌కార్డు మంజూరు

**రొళ్ల :** మండల పరిధిలోని మారుతి కాలనీకి చెందిన ప్రసాద్ రేషన్‌కార్డు కోసం ఆరు సార్లు దరఖాస్తు చేసుకున్నా ఫలితం లేదని శనివారం ప్రజాశక్తి దినపత్రికలో వార్త ప్రచురితం కావడంతో రెవెన్యూ అధికారులు తక్షణమే స్పందించారు. ఈ విషయంపై డిప్యూటీ తహశీల్దార్ భాగ్య లక్ష్మి ప్రజాశక్తితో మాట్లాడుతూ ఇంతకు ముందు వాలిడేషన్‌లో ఉన్నందున అర్జీదారులకు ఇంతవరకూ మంజూరు చేయలేదని, ఇప్పుడు ప్రభుత్వ ఉద్యోగిని తొలగించి విడిగా రైస్ కార్డు మంజూరు చేసినట్లు తెలిపారు. నిబంధనల ప్రకారం దరఖాస్తు చేసుకున్న 6 నెలలకు ఒకసారి జూన్‌లో రేషన్ కార్డ్ మంజూరు చేసినట్లు తెలిపారు. ప్రసాద్ ఈ నెలకు సంబంధించి రేషన్ తీసుకున్నట్లు ఆమె తెలిపారు.

## 8న ప్రత్యేక సమావేశం

**బత్తలపల్లి :** స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఈ నెల 8వ తేదీ ఉదయం 10 గంటలకు ప్రత్యేక సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఓ శ్రీదేవి తెలిపారు. బత్తలపల్లిలో శనివారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ ఆ సమావేశంలో మండల అధ్యక్షుడి ఎన్నిక నిర్వహిస్తామన్నారు. కావున మండలంలోని ఎంపిటిసీలు, కోఆప్షన్ సభ్యులు అందరూ హాజరు కావాలని ఆమె సూచించారు.

## మిగిలిన సీట్ల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

**లేపాక్షి :** జిల్లాలోని మహాత్మా జ్యోతి బాపూలే బిసి సంక్షేమ గురుకుల పాఠశాల (ఇంగ్లీష్ మీడియం)లో 2023–24లో మిగిలిన సీట్ల భర్తీ కోసం దరఖాస్తు చేసుకోవాలని బీసీ రెసిడెన్షియల్ పాఠశాలల కన్వీనర్ ప్రిన్సిపల్ ప్రసాద్ శనివారం తెలిపారు. బాలికలకు టేకులోడు, గుడి బండ, బుక్కపట్టణం, నసనకోట, బాలురకు లేపాక్షి, రొద్దం–1, 2, గుండుమల, పేరూరు, రేగాటిపల్లి పాఠశాలల్లో 6, 7, 8, 9 తరగతుల్లో వివిధ కేటగిరీల్లో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీ కోసం ఈ నెల 5 నుంచి 12 లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ప్రవేశ పరీక్ష ఈ నెల 20వ తేదీ దరఖాస్తు చేసుకున్న పాఠశాలలో నిర్వహిస్తార న్నారు. ప్రతిభ ఆధారంగా విద్యార్థులను చేర్చుకుంటామన్నారు. తల్లిదండ్రుల వార్షిక ఆదాయం రూ. 1 లక్షకు మించరాదన్నారు. వివరాలకు పాఠశాల ప్రధానాచార్యులను సంప్రదించాలని తెలిపారు

## మడకశిర-విజయవాడ బస్సు వేళలు మార్పు

**మడకశిర రూరల్ :** మడకశిర నుంచి విజయవాడకు 6:00 గంటలకు వెళ్లే సూపర్ లగ్జరీ బస్సు సర్వీసును 9 గంటలకు మార్చామని ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని ఆర్టీసీ డిపో మేనేజర్ రామసుబ్బ తెలిపారు. ఆయన శనివారం పట్టణంలోని ఆర్టీసీ డిపోలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఇంధన పొదుపుపై డ్రైవర్లకు సూచనలు సలహాలు అందిస్తున్నామన్నారు. పెనుకొండ నుంచి పరిసర ప్రాంతాలకు బస్సు సౌకర్యం కల్పించామని తెలిపారు.

## 'పది' పరీక్షలకు 382 మంది గైర్హాజరు

**కొత్తచెరువు :** జిల్లా వ్యాప్తంగా శనివారం జరిగిన పదో తరగతి హిందీ పరీక్షకు 382 మంది గైర్హాజరయ్యారని డీఈఓ కార్యాలయం ఏడి నాగరాజు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 58 కేంద్రాల్లో 1,348 మంది పరీక్షలు రాయాల్సి ఉండగా 966 మంది పరీక్షకు హాజరయ్యారన్నారు.

## 'రవీంద్ర విద్యానికేతన్'లో అడ్మిషన్లు ప్రారంభం

**గుడిబండ:** స్థానిక రవీంద్ర విద్యానికేతన్‌లో 1 నుంచి 10వ తరగతి వరకు అడ్మిషన్లు ప్రారంభమైనట్లు కరస్పాండెంట్లు చిత్తయ్య, రాజు శనివారం తెలిపారు. వారు మాట్లాడుతూ పాఠశాలలో పటిష్టమైన ప్రణాళిక, అనుభవం గల కార్పొరేట్ టీచర్లు, యాజమాన్యం ఆధ్వర్యంలో విద్యా బోధనతో పాటు బాల బాలికలకు ప్రత్యేక హాస్టల్ వసతి ఉందన్నారు. నాణ్యమైన ఇంగ్లీష్ విద్య కోసం ప్రైమరీ క్లాసులు కేరళ టీచర్లు బోధిస్తారన్నారు. శారీరక, మానసిక పెరుగుదల, ఆటల కోసం ప్రత్యేక టీచర్లు నియమించామన్నారు. 5వ తరగతి విద్యార్థులకు నవోదయ, సైనిక్ స్కూల్ పరీక్షలపై ప్రత్యేక తరగతులు, సాంస్కృతిక కార్యక్రమాలు, బస్సు సౌకర్యం కల్పిస్తున్నామన్నారు. 2022–23లో పదో తరగతి ఫలితాల్లో వంద శాతంఉత్తీర్ణత సాధించామన్నారు.

## నీటి సమస్యను పరిష్కరిస్తాం

**బత్తలపల్లి :** స్థానిక ఇందిరమ్మ కాలనీలో తాగునీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరిస్తామని ఎంపీడీఓ శ్రీదేవి తెలిపారు. ఎంపీడీఓతో పాటు ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ వరలక్ష్మీ, ఏపీఓ కుందానం ఆదెప్ప శనివారం ఇందిరమ్మ కాలనీలో పర్యటించి నీటి సమస్యపై స్థానికులతో చర్చించారు. నీటి సమస్యను అధిగమించేందుకు కాలనీలో ఐదు సిస్టమ్స్ ఏర్పాటుతో పాటు పైపులైన్ వేసేందుకు కొలతలు వేయించాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈని ఆదేశించారు.

కాలనీవాసులతో మాట్లాడుతున్న ఎంపీడీఓ శ్రీదేవి

# 'ముందస్తు' హడావుడి

**ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి**

రాజకీయ నేతల్లో ముందస్తు హడావుడి కనిపిస్తోంది. సాధారణంగా 2024 సంవత్సరంలో సార్వత్రిక ఎన్నికలు జరగాల్సి ఉంది. కాని కొద్దిగా ముందుగానే వైసిపి ప్రభుత్వం ఎన్నికలకు వెలుతుందన్న ప్రచారం సాగుతోంది. ఈనేపథ్యంలో అభ్యర్థులు ముందుగానే తమ స్థానాలను పదిలం చేసుకునేందుకు సమాయత్తమవుతున్నారు. నియోజ కవర్గాల్లో బలప్రదర్శనలతోపాటు, పెద్దఎత్తున ప్రచార కార్యక్రమాలకు సన్నద్ధమవుతున్నారు. ఏది ఏమైనా ఈ ఏడాది ఆఖరు సంవత్సరం కావడంతో నేతల్లోనూ ఎన్నికల హడావుడి కనిపిస్తోంది. ప్రధాన ంగా అధికారపార్టీలో ఇది అధికంగా కనిపిస్తోంది. తమ కాలంలో చేపట్టిన అభివృద్ధిని చూపించుకు నేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేశారు. అందులో భాగంగా అనంతపురం నియోజకవర్గంలో ఫ్లై ఓవర్ బ్రిడ్జి నిర్మాణాన్ని పెద్దఎత్తున తమ అభివృద్ధిగా చెప్పుకునేందుకు ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి ఈ వారంలో ప్రారంభించారు. వైసిపి అధికారంలోకి వచ్చి నాలుగేళ్లు పూర్తయిన రోజునే దీన్ని పార్టీ పరంగానే ప్రారంభించి పెద్దఎత్తున వైసిపి నాయకులను, కార్యకర్తలతో సందడి చేశారు. ఇంకా పెద్దఎత్తున అభివృద్ధి తమ హయంలో చేపట్టామని నియోజకవర్గ ప్రజలకు తెలియజేసే విధంగా ప్లాన్ చేశారు. ఇక మంత్రి ఉషచరణ్ శ్రీ కూడా తమ నాలుగేళ్ల పాలనలో పెద్దఎత్తున అభివృద్ధి చేసామని చాటి చెప్పడమే కాకుండా తనకు నియోజకవర్గంలోనున్న పట్టును బలప్రదర్శన ద్వారా చాటి చెప్పేందుకు పెద్దఎత్తున జనసమీకరణకు సిద్ధపడ్డారు. ఆదివారం నాడు భారీ ప్రదర్శనకు సమయత్తమయ్యారు. ఇక తాడిపత్రి నియోజకవర్గంలో అక్కడి ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి ఏడాది కిందటి నుంచి నియోజకవర్గంలో పాదయాత్ర చేపడుతున్నారు. తాజాగా తాడిపత్రి మండలంలోనూ పాదయాత్రను ముగించారు. ఈ సందర్భంగా జిల్లా పార్టీ ఇంఛార్జీ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కూడా హాజరయ్యారు. పుట్టపర్తి నియోజకవర్గంలోనూ శ్రీధర్‌రెడ్డి , రాయదుర్గంలో కాపు రామచంద్రారెడ్డి కూడా నాలుగేళ్ల అభివృద్ధిపై ప్రచారం



చేసుకునే పని చేపట్టారు. ఇలా ఒక్కొక్క చోట అధికారపార్టీ నేతలు తమ ప్రయత్నాలను ముమ్మరం చేసుకుంటున్నారు. ఇక ప్రతిపక్ష టిడిపి ప్రభుత్వ వైఫల్యాలను ఎత్తి చూపుతూ ప్రచారం చేపడుతోంది. ఈ సందర్భంగా అధికార వైసిపి, టిడిపి నాయకుల మధ్య మాటల యుద్ధం కొనసాగుతోంది. తాడిపత్రి, రాయదుర్గం, కళ్యాణదుర్గం తదితర నియోజకవర్గాల్లో తీవ్ర స్థాయిలో విమర్శలు, ప్రతి విమర్శలు కొనసాగుతున్నాయి. అన్నీ కలిపి రాజకీయ వేడిని రాజేస్తున్నాయి. నేతల ఇళ్ల వద్ద కూడా అప్పుడే రాజకీయ సందడి కొనసాగుతోంది. ఈ క్రమంలో అధికారుల బదిలీలు ఈవారంలో సాగుతున్నాయి. అధికారులు తమకు అనుకూలమైన వారిని నియమించుకోవడానికి ప్రయత్నాలు చేస్తున్నారు. పెద్దఎత్తున సిఫారసు లేఖల కోసం అదికారులు క్యూలు కడుతున్నారు. ఈ బదిలీలపైనా అనేక ఆరోపణలూ వస్తున్నాయి. వచ్చే ఎన్నికలను దృష్టిలో ఉంచుకునే కొంత మంది అధికారుల బదిలీలు కొనసాగుతున్నట్టు చర్చ సాగుతోంది. ప్రధానంగా రెవెన్యూ, పోలీసు శాఖలు ఎన్నికల్లో కీలకంగా వ్యవహరించేవి. కావున ఆ రెండు శాఖల్లోని వారిని ఇప్పుడు తమకు అనుకూలంగా ఉండేవారు ఎక్కడుండాలన్న దానిపైనా నాయకులు దృష్టి పెడుతున్నారు. వారిని ఆయ స్థానాల్లో నియమించుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. మొత్తంగా చూసినప్పుడు అప్పుడే ఎన్నికల ఫీవర్ ఉమ్మడి అనంతపురం జిల్లాలో మొదలైనట్టుగా కనిపిస్తోంది. నాయకులు వాటి కోసం ఇప్పటి నుంచే సమయత్తమవుతున్నారు.

## చిరుధాన్యాల సాగు విస్తీర్ణం పెంచాలి : ఏడీ

**ప్రజాశక్తి-లేపాక్షి**

అవగాహన సదస్సులో మాట్లాడుతున్న అల్తాఫ్ అలీ ఖాన్

చిరుధాన్యాలు తినడం వల్ల పోషకాలు పుష్కలంగా లభిస్తాయని, తద్వారా ఆరోగ్యంగా ఉంటారని, కావున ఈ ఏడాది మండలంలో చిరుధాన్యాల సాగు విస్తీర్ణం పెంచాలని హిందూపురం వ్యవసాయ సహాయ సంచాలకులు అల్తాఫ్ అలీఖాన్ సూచించారు. స్థానిక వ్యవ సాయ కార్యాలయంలో శనివారం రైతులు, ఆర్‌బికె సిబ్బందితో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీ చిరు ధాన్యాలైన రాగి, కొర్ర, సజ్జ, జొన్న, అండు కొర్రలు సాగు, ఉపయో గాల గురించి వివరించారు. ప్రతి ఆర్‌బికెలో సదస్సులు నిర్వహించి వారి పరిధిలోని రైతులకు చిరుధాన్యాల సాగుపై అవగా హన కల్పించాలని సూచించారు. అలాగే రైతులు పండించిన చిరుధాన్యాలను కనీస మద్దతు ధరకు ఆర్‌బికెల ద్వారా తీసుకుంటామన్నారు. రాగి పంటను కనీస మద్దతు ధర క్వింటాల్ రూ. 3,578తో ప్రభుత్వం కొనుగోలు చేస్తుందన్నారు. సదస్సు లో ఏఓ శ్రీలత, ఏఈఓ పుష్ప, రైతు భరోసా సిబ్బంది పార్థసారథి, తిరుమలేష్, రైతులు, తదితరులు పాల్గొన్నారు

# బహిరంగ చర్చకు సిద్ధమా.?

### ఎమ్మెల్యే శంకర నారాయణకు మాజీ ఎంపీ నిమ్మల సవాల్

నివాసంలో మాట్లాడుతున్న మాజీ ఎంపీ నిమ్మల కిష్టప్ప

**గోరంట్ల :** నాపై అసత్య ఆరోపణలు, అనుచిత వ్యాఖ్యలు చేసిన పెనుగొండ ఎమ్మెల్యే శంకర నారాయణ బహిరంగ చర్చకు సిద్ధమా అని మాజీ ఎంపీ నిమ్మల కిష్టప్ప సవాల్ చేశారు. పట్టణంలోని తన నివాసంలో శనివారం ఆయన మాట్లాడు తూ నా 40 ఏళ్ల రాజకీయ చరిత్రలో ఏనాడూ అవినీతికి పాల్పడలేదు, నీవు నాలుగేళ్లలో నియోజకవర్గంలో తమ్ముళ్ల ద్వారా దోచుకోవడం తప్ప, అభివృద్ధి చేసింది శూన్యం అన్నారు. మీ తమ్ముళ్లు ప్రతి పనికి మామూలు దండుకుంటున్నారు, నియోజకవర్గంలో ఎక్కడ చూసినా భూకబ్జాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. మీ పార్టీ కార్యకర్తలే చెప్పులు, రాళ్లు విసిరారు.. నీది రాజకీయ బతుకేనా అని ప్రశ్నించారు. ఎంపీపీ, జడ్పీటీసీల నుంచి ముడుపులు తీసుకుంది ఎవరో అందరికీ తెలుసు అన్నారు. ఇకనైనా అసత్య ఆరోపణలు, వ్యక్తిగత వ్యవహారాల్లో జోక్యం చేసుకోవడం మానుకోవాలన్నారు. ఆయనతో పాటు బాలకష్ణ చౌదరి, సుబ్రహ్మణ్యం, నరేష్, శ్రీనివాసులు, ఎల్ఎన్ నారాయణస్వామి, నరసింహులు ఉన్నారు.

## ప్రభుత్వ ఆసుపత్రిలో ఆర్వో ప్లాంటు ప్రారంభం

ప్రభుత్వాస్పత్రిలో ఆర్వో ప్లాంటును ప్రారంభిస్తున్న దాత

**ధర్మవరం టౌన్ :** పట్టణంలోని ప్రభుత్వాస్పత్రిలో రోగుల సౌకర్యార్థం ఆర్వో ప్లాంటును ఏర్పాటు చేయడం అభినందనీయమని ఇన్‌ఛార్జి సూపరింటెండెంట్ డాక్టర్ నజీర్ పేర్కొన్నారు. మాజీ ఎమ్మెల్యే పల్లెం వెంకటేశ్ జ్ఞాపకార్థం ఆయన కుమారులు పల్లెంజనార్దన్, భార్య పల్లెం నిర్మల రూ. 2.50లక్షల ఖర్చుతో ఆర్వో ప్లాంటును ఏర్పాటు చేయగా శనివారం వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా దాతలతో పాటు ఆర్వోప్లాంటు ఏర్పాటుకు సహకరించిన మున్సిపల్ మాజీ ఛైర్మన్ గడ్డం పార్థసారథి, పల్లెం వేణుగోపాల్‌ను వైద్యులు, సిబ్బంది శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ ఉదయ్ బాస్కర్, పీడియాట్రిషన్ డాక్టర్ వెంకటేశ్వర్లు, సర్సింగ్ సూపరింటెండెంట్ రమాదేవి, రేడియో గ్రాఫర్ రామ్మోహన్, సిబ్బంది పాల్గొన్నారు.

## సేవా కార్యక్రమాలు చేపట్టండి

అన్నదాన కార్యక్రమం చేస్తున్న పరిటాల సునీత

**బత్తలపల్లి:** టిడిపి శ్రేణులు రాజకీయమైన కార్యక్రమాలే కాకుండా సేవా కార్యక్రమాలు చేపట్టినపుడే ప్రజల్లో మంచిపేరు వస్తుందని మాజీమంత్రి పరిటాల సునీత సూచించారు. గంటాపురం గ్రామానికి చెందిన టిడిపి యువ నేత తాళ్లూరు సతీష్ పుట్టినరోజు సందర్భంగా శనివారం బత్తలపల్లిలో చేపట్టిన పలు సేవా కార్యక్రమాల్లో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ముందుగా స్థానిక పార్టీ కార్యాలయంలో ఎన్టీఆర్, పరిటాల రవీంద్ర చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆర్డీటీ కార్యాలయం వద్ద రోగులకు, వారి బంధువులకు అన్నదానం చేశారు. కల్యాణ మండపంలో రక్తదాన శిబిరాన్ని ప్రారంభించి దాతలకు ప్రశంసాపత్రాలు అందజేశారు. అక్కడ అన్నదాన శిబిరాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి గోనుగుంట్ల విజయకుమార్, మండల కన్వీనర్ నారాయణరెడ్డి, సర్పంచి ప్రభాకర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## నేటి నుంచి అంకాలమ్మ విగ్రహ ప్రతిష్ట కార్యక్రమాలు

**బత్తలపల్లి :** స్థానిక ఎస్సీ కాలనీలో నూతనంగా నిర్మించిన ఆలయంలో నేటి(ఆదివారం) నుంచి మంగళవారం వరకు అంకాలమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు అర్చకులు నరసింహులు తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ విగ్రహ ప్రతిష్టాపనలో భాగంగా పుణ్యాహ వచనం, కలశస్థాపన, కళారాధన, ప్రదోషకాల పూజ, ధాన్యాధివాసం, గణపతి, నవగ్రహ హోమాలు, అమ్మవారి గ్రామోత్సవం, ప్రాత్ఞకాలపూజ, దుర్గ, రుద్ర, ఆదివాస, వాస్తు, మృత్యుంజయ హోమాలు, అంకాలమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ట, యంత్రస్థాపన పూర్ణహుతి, అన్నదాన కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు.

అంకాలమ్మ ఆలయం

## వైఎస్ఆర్ బీమా నమోదు చేసుకోవాలి

**ప్రజాశక్తి-గోరంట్ల రూరల్**

వైఎస్ఆర్ బీమా సర్వేపై సమావేశం నిర్వహిస్తున్న దృశ్యం

కుటుంబ భద్రత కోసం ప్రతి ఒక్కరూ వైఎస్ఆర్ బీమా నమోదు(ఉచితం) చేసుకోవాలని కమ్మవారిపల్లి సర్పంచి శివమణి, ఎంపీటీసీ శ్రీనివాస్‌రెడ్డి సూచించారు. కమ్మవారిపల్లి రైతు భరోసా కేంద్రంలో శనివారం వారు వైఎస్ఆర్ బీమా సర్వేపై సమావేశం నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఈ బీమా పథకం ద్వారా (18 నుంచి 49 ఏళ్ల లోపు వారు) సాధారణ మరణానికి రూ. లక్ష, ప్రమాదవశాత్తు మరణిస్తే వారి కుటుంబానికి రూ. 5 లక్షలు ఆర్థిక సాయం అందుతుందన్నారు. ప్రతి వాలంటీర్ వారి క్లస్టర్ పరిధిలో ఉన్న బియ్యం కార్డు లబ్ధిదారులందరి చేత జూన్ 7వ తేదీ లోపు వైఎస్ఆర్ బీమా సర్వే 100% పూర్తి చేయాల న్నారు. అర్హత ఉండి ఎవరికైనా వైఎస్ఆర్ బీమా సర్వే చేయకపోతే సంబంధిత వాలంటీర్‌దే బాధ్యత అన్నారు. బీమా ఖర్చును ప్రభుత్వం భరిస్తుందని, ఏ ఒక్క లబ్ధిదారుడు ఒక్క రూపాయి కూడా చెల్లించా ల్సిన అవసరం లేదన్నారు. సంక్షేమ, విద్య కార్యదర్శి చంద్రమోహన్ వైఎస్ఆర్ బీమా సర్వే నిబంధనలు, అర్హతలు, పాలసీదారు, నామినీ, ప్రయోజనాల గురించి వాలంటీర్లకు వివరించారు. కార్యక్రమంలో కమ్మవారిపల్లి పంచాయతీ సర్పంచి చాపట్ల మణి శివశంకర్ రెడ్డి, ఎంపీటీసీ సిరగం శ్రీనివాస్‌రెడ్డి, స్థానిక నాయకులు శివశంకర్‌రెడ్డి, ప్రజాప్రతినిధులు, పంచాయతీ కార్యదర్శి స్వప్న, గ్రామ వాలంటీర్లు, ప్రజలు పాల్గొన్నారు.

## ధనకొండ గంగమ్మ విగ్రహ ప్రతిష్టాపన

అమ్మవారి సన్నిధిలో మాజీ ఎమ్మెల్యే వెంకటప్రసాద్

**తనకల్లు:** మండల పరిధిలోని కనసానివారిపల్లి వద్ద నూతనంగా నిర్మించిన ధనకొండ గంగమ్మ ఆలయంలో శనివారం అమ్మవారి విగ్రహాన్ని ప్రతిష్టించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే పీవీ సిద్ధారెడ్డి, మాజీ ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్, వజ్ర భాస్కర్ రెడ్డి, వాల్మీకి విద్యాసంస్థల అధినేత పవన్‌కుమార్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అమ్మవారి అనుగ్రహం వల్ల గ్రామ ప్రజలు సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ఛైర్మన్ ఎంజి రెడ్డి, వైసిపి మండల కన్వీనర్, మధుసూదన్‌రెడ్డి, కొక్కంటి శ్రీనివాసులునాయుడు, ఆసుపత్రి కమిటీ మెంబర్ కనుమల వినోద్‌రామ్ దేశాయ్, శేఖర్ రెడ్డి, తెలుగు యువత మండల అధ్యక్షుడు కావడి ప్రవీణ్ కుమార్, ఆనంద్, తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యేకు గ్రీన్ భారత్ ఫౌండేషన్ సభ్యుల ఆహ్వానం

ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డిని కలిసిన గ్రీన్ భారత్ ఫౌండేషన్ సభ్యులు

**పుట్టపర్తి రూరల్:** ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డిని శనివారం గ్రీన్ భారత్ ఫౌండేషన్ సభ్యులు, రెడ్డివారి శంకర్ రెడ్డి అవార్డు గ్రహీత రెడ్డివారి శంకర్ నారాయణ కలిసి మొక్కలు నాటే కార్యక్రమానికి రావాలని ఆహ్వానించారు. ఓడిసి మండలంలోని గౌనిపల్లి సమీపంలో అక్కమ్మ దేవస్థానం వద్ద మొక్కలు నాటడా నికి ఏర్పాట్లు చేశారు. ప్రతి గ్రామంలో గ్రీన్ బెల్ట్ కమిటీలు ఏర్పాటు చేసి ఇంటిం టా చెట్టు ఊరంతా పచ్చదనం చేయడమే గ్రీన్ భారత్ లక్ష్యం అన్నారు. ఇప్పటికే ఉమ్మడి జిల్లాలో 12 లక్షల మొక్కలు నాటినట్లు తెలిపారు. తర్వాత ప్రతి పాఠశాల లు, కళాశాలలు, యూనివర్సిటీల్లో విద్యార్థులను చైతన్యపరుస్తామని తెలిపారు.

# చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి

### మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి

**ప్రజాశక్తి-మడకశిర**

మడకశిరలో చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న టిడిపి నాయకులు

టిడిపి అధినేత చంద్రబాబునాయుడుతోనే రాష్ట్ర అభివద్ధి సాధ్యమని పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి పేర్కొన్నారు. పట్టణంలోని బాలాజీ నగర్‌లో ఉన్న పార్టీ శనివారం నాయకులు, కార్యకర్తలతో సమావేశం ఏర్పాటు చేశారు. ముందుగా చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా తిప్పేస్వామి మాట్లాడుతూ మహానాడులో ప్రకటించిన మినీ మేనిఫెస్టోతో అన్ని వర్గాలకు మేలు జరుగుతుందన్నారు. రాబోయే ఎన్నికల్లో టిడిపి ఘన విజయం సాధించి చంద్రబాబు సీఎం కావడం ఖాయమన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాస్‌మూర్తి, పట్టణ అధ్యక్షుడు మనోహర్, లక్ష్మీనారాయణ, మైనార్టీ సెల్ అధ్యక్షుడు భక్తర్ సాబ్, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు మంజునాథ్, డాక్టర్ సెల్ అధ్యక్షుడు కష్ణమూర్తి, కార్యదర్శి పుల్లయ్య చౌదరి, ఐటీడీపీ తాలూకా అధ్యక్షుడు కాంతరాజు, ఉపాధ్యక్షుడు చంద్ర, తదితరులు పాల్గొన్నారు.

**తనకల్లు:** స్థానిక అంబేద్కర్ కూడలిలో శనివారం టిడిపి ఆధ్వర్యంలో చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ టిడిపి మేనిఫెస్టోతో మహిళలు, రైతులు, నిరుద్యోగులు, యువతతో పాటు అన్నివర్గాల ప్రజలు హర్షం ప్రకటించారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ రెడ్డి శేఖర్‌రెడ్డి, తెలుగు యువత మండల అధ్యక్షుడు కావడి ప్రవీణ్ కుమార్, జిల్లా బీసీ సెల్ వైస్ ప్రెసిడెంట్ సోంపాలెం నాగభూషణం, క్లస్టర్ ఇన్‌ఛార్జి పిజి మల్లికార్జున, శంకర్ నాయుడు, కాంతమ్మ, ప్రసాద్, బాలప్ప, హరినాయక్, వేమనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

తనకల్లులో చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న టిడిపి నాయకులు

## నేరాలు ఘోరాలు

### పేకాటజూదరులు అరెస్టు

**చిలమత్తూరు :** మండల పరిధిలోని కోడూరు శివారు ప్రాంతంలో గ్రానైట్ ఫ్యాక్టరీ వెనుక పేకాట ఆడుతున్న నలుగురు వ్యక్తులను శనివారం అరెస్టు చేసి వారి నుంచి రూ. 5,830 నగదు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్సై శ్రీనివాసులు తెలిపారు.

## 'వెంకటాద్రి గ్రీన్స్' సిబ్బందికి అండగా ఉంటాం

### కంపెనీ అధినేత శంకర్

**ప్రజాశక్తి-హిందూపురం**

ఉద్యోగులతో సంస్థ అధినేత శంకర్

సంస్థ అభివృద్ధికి శ్రమించిన ప్రతి ఒక్కరినీ ఆదుకుంటామని వెంకటాద్రి గ్రీన్స్ కంపెనీ అధినేత శంకర్ పేర్కొన్నారు. వెంకటాద్రి గ్రీన్స్ కంపెనీ ఆధ్వర్యంలో హిందూపురం పట్టణం, రూరల్ మండలం కిరికెర, పరిగి సమీపంలో తదితర ప్రాంతాల్లో వెంచర్లు వేశారు. సంస్థలు పనిచేసే ఉద్యోగులందరికీ అధినేత శంకర్ ఉచితంగా ఇంటి స్థలాలను వారి పేరున రిజిస్టర్ చేసి శనివారం వారికి అందించారు. ఈ సందర్భంగా శంకర్ మాట్లాడుతు సంస్థలు పనిచేసే ఉద్యోగులందరూ తమతో సమానంగా ఉండాలని సంకల్పించి లక్షలు విలువ చేసే ఇంటి స్థలాలను అన్ని ఖర్చులను భరించి రిజిస్టర్ చేసి వారికి ఉచితం గా అందించామన్నారు. దీంతో పాటు ఉద్యోగులతో పాటు వారి కుటుంబ సభ్యులందరికీ వైద్య సౌకర్యం, వారి పిల్లల విద్యాభివృద్ధికి చేయూతనందించామ న్నారు. ఇకముందు కూడా సంస్థ అభివృద్ధికి కషి చేసి, తమతో పాటు ఉద్యోగులు కూడా ఎదగాలని కోరారు. కార్యక్రమంలో కంపెనీ యాజమాన్యంతో పాటు ఉద్యోగులు పాల్గొన్నారు.

## విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమంలో ఎమ్మెల్యే

ఆంజనేయస్వామి సన్నిధిలో ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి

**పుట్టపర్తి రూరల్:** మండల పరిధిలోని గంగిరెడ్డిపల్లి ఆంజనేయస్వామి దేవాలయంలో శనివారం నిర్వహించిన విగ్రహ ప్రతిష్టాపన మహోత్సవంలో ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి పాల్గొన్నారు. ఆలయంలో రెండు రోజుల నుంచి యజ్ఞ యాగా దులు నిర్వహిస్తుంచగా శనివారం ధ్వజస్తం భం, గణపతి, దత్తాత్రేయ విగ్రహాల ప్రతిష్టాపన జరిగింది. అంతకుముందు ఎమ్మెల్యేకి ఆలయ అర్చకులు పూర్ణకుంభ స్వాగతం పలికారు. అనంతరం ఆయన ఆలయంలో, ఆవరణలో ఉట్ల పరుష ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ ఆలయం రోజు రోజుకూ ఎంతో అభివృద్ధి చెందుతోందన్నారు. భవిష్యత్తులో ఆలయ అభివృద్ధికి దాతలు, ప్రజలు సహకరించాలని కోరారు. ఎమ్మెల్యే వెంట ఎంపీపీ ఏవి రమణా రెడ్డి, జడ్పిటిసి లక్ష్మీనరసమ్మ, గంగాద్రి, మండల కన్వీ నర్లు నరసారెడ్డి, రంగారెడ్డి, ఎంపీటీసీ ఉషాదేవి, గంగిరెడ్డిపల్లి సర్పంచి బాలగంగాధర్, భక్తులు పాల్గొన్నారు.

## వైద్య శిబిరానికి విశేష స్పందన

రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

**మడకశిర :** పట్టణంలోని సాయి అక్షర జూనియర్ కళాశాలలో శనివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించినట్లు ప్రిన్సిపల్ గోవిందప్ప, జ్ఞానవృక్ష చారిటబుల్ ట్రస్ట్ కోఆర్డినేటర్ రాకేష్‌కుమార్ తెలిపారు. ఈ శిబిరానికి నియోజకవర్గ వ్యాప్తంగా 250 మం ది హాజరవగా వైద్యులు పరీక్షలు నిర్వహించి 136 మందిని శస్త్ర చికిత్సలకు సిఫారసు చేశారు. మారుమూల ప్రాంతంలో ఇలాంటి వైద్య శిబిరాలు ప్రజలకు ఎంతో మేలు చేస్తాయని వారు తెలిపారు.

## అంగన్‌వాడీల అవగాహన ర్యాలీ

**ప్రజాశక్తి-హిందూపురం**

హస్నాబాద్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు, అంగన్‌వాడీ కార్యకర్తలు

పట్టణంలోని హస్నాబాదులో శనివారం అంగన్‌వాడీ కార్యకర్తలు అంగన్‌వాడీ పిలుస్తోంది అని అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వార్డు కౌన్సిలర్ ఆసీఫ్ మాట్లాడుతూ మూడేళ్లు నిండిన చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రంలో చేర్పించాలని కోరారు. వారికి ఆట పాటలతో ఆంగ్ల భాషలోనే నర్సరీ, ఎల్‌కెజి, యూకెజి విద్యనందించడంతో పాటు పౌష్టిక ఆహారం అందిస్తామన్నారు. ర్యాలీలో పాఠశాల హెచ్‌ఎంలు బాల నారాయణ స్వామి, జబివుల్లా, అంగన్ వాడి కార్యకర్తలు సునీత రాణి, మస్తాన్ బీ, దస్త కుమారి, విజయకుమారి తదితరులు పాల్గొన్నారు.

## 'భవిష్యత్తుకు గ్యారంటీ'ని ప్రజల్లోకి తీసుకెళ్లాలి

**ధర్మవరం టౌన్ :** భవిష్యత్తుకు గ్యారంటీ అనే కార్యక్రమాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లే బాధ్యత సెక్షన్ ఇన్‌ఛార్జిలపై ఉందని టీడీపీ పార్లమెంట్ అధికార ప్రతినిధి పురుషోత్తంగౌడ్ సూచించారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో శనివారం గుట్టకిందపల్లి, తారకరామాపురం కాలనీల్లోని మూడు పోలింగ్ బూత్‌లకు సంబంధించిన సెక్షన్ ఇన్‌ఛార్జిల నియామకం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో ఉన్న ప్రతి ఇంటి గడప తొక్కి మహాశక్తి సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు నాగూరుస్సేన్, పరిశేసుధాకర్, అత్తర్ రహీంబాషా పాల్గొన్నారు.

## నాణ్యతాప్రమాణాలు పాటించాలి

వాటర్ ప్లాంటులో తనిఖీలు నిర్వహిస్తున్న అధికారులు

**ధర్మవరం టౌన్ :** పట్టణంలోని వాటర్‌ప్లాం టు నిర్వాహకులు నాణ్య తా ప్రమాణాలు పాటిస్తూ ప్రజలకు శుద్ధమైన తాగునీరు అందించాలని మున్సి పల్ ఈఈ సత్యనారాయణ ఆదేశించా రు. ఈఈతో పాటు ఏఈలు హరీశ్, ప్రతాప్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ మహబూబ్ బాషాలు శనివారం పట్టణంలోని వాటర్ ప్లాంట్లను తనిఖీచేశారు. ఈ సందర్భంగా వారు ప్లాంటులో ట్యాంకులను ఎన్ని రోజులకోసారి శుభ్రం చేస్తున్నారు, లిక్విడ్ ఏ మేరకు వాడుతున్నారు, ఎంత వసూలు చేస్తున్నారని యజమానులను అడిగి తెలుసుకున్నారు. నిబంధనలను పాటించకపోతే ప్లాంట్లను సీజ్ చేస్తామని హెచ్చరించారు.

## రైలు ప్రమాద ఘటనలో మృతులకు నివాళి

**రామగిరి :** ఒడిస్సా రైలు ప్రమాద ఘటనపై మాజీ మంత్రి పరిటాల సునీత తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల ఆత్మకు శాంతి కలగాలని ఆకాంక్షిస్తూ శనివారం మండల పరిధిలోని వెంకటాపురంలో కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఒకేసారి ఇంతమంది మృతి చెందడం చాలా బాధ కలిగించిందన్నారు. మృతుల కుటుంబాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదుకోవాలని ఆమె డిమాండ్ చేశారు. అలాగే ప్రమాదానికి కారణమైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. మరోసారి ఇలాంటి ప్రమాద సంఘటనలు జరగకుండా రైల్వే శాఖ తగిన జాగ్రత్తలు తీసుకోవడంతో పాటు రైల్వే ప్రయాణికులకు జనరల్ బోగీలను పెంచి మెరుగైన ప్రయాణ సౌకర్యాలు కల్పించాలన్నారు.

## ఆర్‌డిటి సెట్‌లో సాయి అక్షర కోచింగ్ సెంటర్ విద్యార్థుల ప్రతిభ

**మడకశిర:** ఆర్‌డిటి సెట్‌లో పట్టణంలోని సాయి అక్షర కోచింగ్ సెంటర్ విద్యార్థులు ప్రతిభ కనబరిచినట్లు ప్రిన్సిపల్ గోవిందప్ప తెలిపారు. పదో తరగతి పాసైన విద్యార్థులకు ఆర్‌డిటి పరీక్షలు నిర్వహించి ప్రతిభ కనబరిచిన వారికి ఇంటర్‌లో ఉచిత విద్యనందిస్తారని తెలిపారు. ఆ పరీక్షలో సాయి అక్షర కోచింగ్ సెంటర్ విద్యార్థులలు ఏడుగురు అర్హత సాధించి నట్లు తెలిపారు.